# అవగాహన

ఫస్టు తారీఖు.

ఉమాపతి ఆ రోజు పర్మిషను పెట్టి నాలుగు గంటలకే ఆఫీసు నుండి బయట పడ్డాడు. హుషారుగా స్కూటరు స్టార్ట్ చేసాడు.

పది నిమిషాలలో స్కూటరు కార్పోరేషన్ హైస్కూలు ముందు ఆగింది.

అప్పుడే బడి విడిచిపెట్టి నట్లుంది. నేవీబ్లూ వైట్ యూనిఫారంలో మల్లె మొగ్గల్లా వున్న బాల బాలికలు జారిపోతున్న బ్యాగులను భుజాల మీద కెగ్రదోసుకుంటూ ఇళ్లకు పరుగు లంఘించారు.

గేటు ప్రక్కగా స్కూటరు పార్కు చేసి, సిగరెట్ అంటించుకుని నీలిమేఘాన్ని సృష్టిస్తూ ఠీవీగా నిలబడ్డాడు ఉమాపతి.

కొలీగ్స్‌తో కబుర్లు చెప్పుకుంటూ బయటపడింది అలివేణి.

శ్రీమతిని చూసి పలుకరింపుగా నవ్వాడు ఉమాపతి.

టీచర్సు అందరితో వస్తానని చెప్పి స్కూటరెక్కింది అలివేణి.

ఉమాపతి ఆమె వ్యానిటీబ్యాగు వంక దృష్టి సారించాడు. అది బరువుగా గోచరించడంతో అతడి ఉత్సాహం రెట్టింపైంది. అంతే, వాహనాన్ని అరవై కిలో మీటర్ల స్పీడులో పోనిచ్చాడు.

అలివేణికి కళ్లు తిరిగినట్లై భర్త నడుం చుట్టూ చేయి వేసి గట్టిగా పట్టుకుంది. ఆమెకు రోజూ బస్సులో ఇంటికి వెళ్లడం అలవాటు. అందుకు భిన్నంగా ఇవాళ ఉమాపతి భార్యని స్కూటరెక్కించుకుని అతి భద్రంగా ఇంటికి తీసుకెళుతున్నాడు.

స్కూటరు ఎ.సి. రెస్టారెంట్ ముందు ఆగింది.

ఇరువురూ ఫ్యామిలీ రూములో కెళ్లి కూర్చున్నారు.

ఏం తీసుకుంటారన్నట్లు బేరరు వాళ్లకెదురుగా వచ్చి నిలబడ్డాడు.

స్వీటు, హాటు ఆర్డరు చేసాడు ఉమాపతి.

అలివేణికి ఉమాపతితో పెళ్లై నెల రోజులవుతోంది. ఉద్యోగం చేసే పిల్ల కోసం అన్వేషణ సాగిస్తూ మూడో పదిలో పడ్డాక అలివేణిని పెళ్లి చేసుకున్నాడు ఉమాపతి. అతడికి చెప్పుకోడానికి తనవారంటూ ఎవ్వరూ లేరు. యల్.ఐ.సి.లో ఉద్యోగం. నెలకు రెండువేలు జీతం. ఈరోజు మొదటిసారిగా భార్య సంపాదనను చూడబోతున్నాడు. ఇరువురి ఆదాయం కలుపుకుంటే నాలుగువేలు పైచిలుకే. ఇహ తనకేం లోటు? కావలసినవన్నీ కొనుక్కోవచ్చు. పుట్టబోయే పిల్లలకు పెద్ద పెద్ద చదువులు చెప్పిస్తాడు. వాళ్లు లక్షలు సంపాదించి తనని కోట్లలో ముంచెత్తుతారు.

బేరరు రాకతో ఉమాపతి ఆలోచనలకు బ్రేకు పడింది.

ఇరువురూ సుష్టుగా టిఫిన్ చేసి ఇంటికొచ్చారు.అలివేణి చీర మార్చుకుని గృహకృత్యాలలో లీనమైంది.

ఉమాపతి లుంగీ కట్టుకుని భార్య పట్టుకొచ్చిన వేడి వేడి కాఫీ అందుకున్నాడు.

అలివేణి కూడా కాఫీ త్రాగుతూ అతడి కెదురుగా కూర్చుంది.

"జీతం అందిందా?" అడిగాడు ఉమాపతి.

"ఊఁ...."

"కట్టింగ్సుపోను చేతికెంత అందుతుంది?"

"పద్దెనిమిది వందలు" అంటూ ఖాళీ కప్పులు తీసుకుని లోనికి వెళ్లిపోయింది అలివేణి.

పెళ్లాం పట్టుకొచ్చిన మొదటి జీతాన్ని వెంటనే అడిగి పుచ్చుకోడానికి మోమాట పడిపోయాడు.

తెచ్చిన జీతం తన చేతి కివ్వక ఏం చేస్తుందనుకుని పేపర్లోకి తలదూర్చాడు ఉమాపతి.

రాత్రి పడుకునేంతవరకు ఓపిక పట్టాడు. ఎంతకూ తన జీతం ప్రసక్తి తీసుకు రాకపోవడంతో చిర్రెత్తింది ఉమాపతికి.

"ఏది నీ జీతం" అడిగాడు మరి వుండలేక.

"దేనికి "

భార్య ప్రశ్నకు ఖంగుతిన్నాడు ఉమాపతి. కొన్ని క్షణాలు అతడి మెదడు

స్తంభించిపోయింది.

"ఏమిటా ప్రశ్న? నువ్వు నట్టుకొచ్చిన డబ్బు ఇలా ఇవ్వు" మరో మాట మాట్లాడేందుకు అవకాశ మివ్వలేదు ఉమాపతి.

కిమ్మనకుండా సొమ్ము తెచ్చి భర్త చేతుల్లో వుంచింది అలివేణి.

"నీ బస్సు ఖర్చులకు ఎంత అవుతుంది?" డబ్బు లెఖ్ఖపెడుతూ అడిగాడు.

జవాబివ్వలేదు అలివేణి.

"ఈ నలభై రూపాయలు నీ బ్యాగులో వుంచేసుకో" మిగిలిన సొమ్ము బీరువాలో భద్రపరుస్తూ అన్నాడు ఉమాపతి.

కళ్లంట నీళ్లు తిరిగాయి అలివేణికి. ఆమె మెదడు తీవ్రంగా పనిచేయసాగింది. అనాదిగా ఆడదానికి ఆర్థిక స్వాతంత్ర్యాన్ని మట్టుపెట్టింది సమాజం. ఇప్పుడిప్పుడే స్త్రీలు బాగా చదువుకుంటూ ఉద్యోగాల్లో కొస్తున్నారు. చిన్నప్పటినుండి ఆమె ఆలోచనా విధానమే వేరు. తనకు ఫలానా వస్తువు కావాలని నోరు విడిచి తన తలిదండ్రుల్ని ఏనాడూ అడగలేదు. పెద్దయ్యాకా ఉద్యోగం చేసుకుని తనకు కావలసినవి కొనుక్కోవాలనుకుంది. దేనికీ ఎవరినీ యాచించవలసిన దుస్థితి తనకు కలుగకూడదు. అందుకే అమ్మవద్దంటున్నా డిగ్రీ వరకు చదివింది. నాన్న కిష్టం లేకపోయినా ఉద్యోగంలో చేరింది. తన సంపాదనను తనకు ఇష్టం వచ్చిన రీతిలో ఖర్చు పెట్టుకోవాలనుకుంది. పెళ్లికి పూర్వం తనకా విషయంలో అణుమాత్రమైనా ప్రతిఘటన ఎదురవలేదు. ఆమె మనస్తత్వాన్ని పూర్తిగా చదివిన తండ్రి ఏనాడూ తన జీతం గురించి గాని, తను పెడుతున్న ఖర్చును గురించి గాని ప్రశ్నించలేదు. తరువాత తనకు పెళ్లి ప్రయత్నాలు జరిగాయి. వివాహం తన ఆర్థిక, స్వాతంత్ర్యాన్ని హరించి వేస్తుందని తెలియక తలవంచి తాళి కట్టించుకుంది. జరుగుతన్నది, తలచుకుంటూ వుంటే దుఃఖం ఆగడంలేదు. ఇకనుండి తను సంపాదించినదంతా కట్టుకున్న వాడి చేతుల్లో గుమ్మరించాలి. ఏం కావాలన్నా పతిదేవుణ్ణి దేవులాడాలి. ఏమిటీ ఖర్మ?.... అందుకేనా తను చదువుకుంది?.... ఈమాత్రానికేనా తను ఉద్యోగం చేస్తోంది?.... మన సంఘంలో ఉద్యోగినులంతా చేసే పని ఇదేనా?.....

అలివేణి హృదయ కడలిలో చెలరేగుతున్న సంచలనాన్ని గ్రహించని ఉమాపతి లైటార్పి భార్యను దగ్గరకు తీసుకున్నాడు.

ఆ రాత్రి సంతోషంగా అతడితో సహకరించలేకపోయింది అలివేణి.

పదిహేను రోజులు గడిచాయి.

నెల రోజులు సెలవు పెట్టి పుట్టింటికి వెళ్లేందుకు సిద్ధమైంది అలివేణి. దగ్గరుండి భార్యని బస్సుకి దిగబెట్టాడు ఉమాపతి.

ఒకరోజు తన క్లాస్‌మేట్ లావణ్యను చూడటానికెళ్లింది అలివేణి. లావణ్య స్థానిక ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో లెక్చరర్‌గా పనిచేస్తోంది.

అలివేణి రాకతో ఊరంత సంబరపడిపోయింది లావణ్య.

ఆమె వారిస్తున్నా వినకుండా జీడిపప్పు ఉప్మా చేసి పట్టుకొచ్చింది. ఆ మాట ఈమాట అయ్యేకా "ఎలా వుంది నీ వైవాహిక జీవితం? ఎక్కడికీ హనీమూన్ ట్రిప్పు వెయ్యలేదా?" అంటూ సంభాషణలోకి దింపింది.

లావణ్య ప్రశ్నతో అదివరకున్న ఉత్సాహం కాస్త నీళ్లు కారిపోయింది. ముఖంలో రంగులుమారాయి.

"ఏమిటలా అయిపోయావ్" అడిగింది లావణ్య.

"ఆయనకు విడాకులివ్వాలనుకుంటున్నాను".

అలివేణి మాటలకు అదిరి పడింది లావణ్య.

"అవేం మాటలే. పెళ్లై రెండు మాసాలైనా కాలేదు...."

"నేను ఉద్యోగం చేస్తున్నది ఒకరిపై ఆధారపడి బ్రతకటానికి కాదు. నాకు ఆర్థిక స్వేచ్ఛ కావాలి. అది ఆయన వద్ద కరువైంది. తిలకం సీసా కావాలన్నా. కాటుక డబ్బీ కొనుక్కోవాలన్నా చేయిచాపాలి. నా మనసు అందుకు అంగీకరించడం లేదు. వైవాహిక జీవితానికి తిలోదకాలిచ్చి స్వేచ్ఛగా బ్రతకాలని నిర్ణయించుకున్నాను" అంటూ లేచి నిలబడింది అలివేణి.

"కూర్చో"

బొమ్మలా చతికిలబడింది అలివేణి.

"చిన్నప్పటినుండి నీ సైకాలజీ నెరిగిన దానిని. పెళ్లైతే నీ ధోరణి మారుతుందనుకున్నానే తప్ప ఇటువంటి విపరీత నిర్ణయాలు తీసుకుంటావనుకోలేదు. నేనో ప్రశ్న అడుగుతాను సూటిగా సమాధానం చెబుతావా?"

ప్రశ్నార్థకంగా ముఖం పెట్టింది అలివేణి.

"మీ ఆయనకు వ్యసనాలేవైనా ఉన్నాయా?".... విచ్చల విడిగా డబ్బు ఖర్చుచేస్తాడా.'"

"అటువంటిదేమీలేదు."

"మరింకేం? నువ్వు సంపాదించినా, మీ వారు గడించినా సంసారం కోసమే

కదా! భార్యా భర్తల మధ్య సర్దుబాటు ధోరణి ఉండాలి. నీకు తెలుసునో తెలియదో నేను గెజిటెడాఫీసర్ని అయినా నేను పెళ్లాడింది ఒక సాధారణ గుమాస్తాని. ఐనా నా సర్వస్వాన్ని ఆయనకు అర్పించడానికి నా మనసు ఏనాడూ వెనుకాడదు. మన సమాజంలో ప్రతి మహిళ మగడు తనకంటె ఉన్నతంగా వుండాలని కోరుకుంటుంది. భార్యాభర్తలు షాపింగుకు బయలుదేరి నప్పుడు భర్త నిరుద్యోగి అయినా భార్య అతడి చేతికి డబ్బిచ్చి కావలసినవి కొనిపిస్తుంది. అంతమాత్రాన ఆమె హోదా తగ్గిపోదు. సరికదా పెరుగుతుంది. భార్య తనకు కావలసిన దానిని భర్త నడిగి పొందడంలో వున్న ఆనందం స్వతంత్రంగా సంపాదించుకోవడంలో ఉండదు. రానురాను నీకా విషయం అర్థమౌతుంది. తొందరపడి నిర్ణయాలు తీసుకోకు" నచ్చచెప్పేందుకు ప్రయత్నించింది లావణ్య.

"ఏమో! నువ్వెన్ని చెప్పు నేనా పద్ధతికి అలవాటు పడలేకపోతున్నాను."

"పోనీ నేనో సలహా ఇవ్వనా?"

అంతకన్నా కావలసినదేమిటనుకుంది అలివేణి.

"మీరు బ్యాంకులో జాయింట్ ఎక్కౌంట్ ప్రారంభించి మీరు తెచ్చుకున్న జీతాలు అందులో వేసుకోండి. ఎవరికి ఎప్పుడు ఎంత కావాలో డ్రా చేసుకోండి. ఖర్చు విషయాలకొస్తే ఇరువురూ జాగ్రత్త పరులే గనుక సమస్యలు ఉత్పన్నం కావు.

"థాంక్స్ లావణ్యగారూ. మీ సలహా నాకు నచ్చింది." అన్నాడు ఉమాపతి లోపలకొస్తూ.

"మీరు...." భర్త వంక ఆశ్చర్యంగా చూసింది అలివేణి.

"ఇప్పుడే వచ్చాను. నువ్వు మీ ఫ్రెండ్ లావణ్యగారింటికి వెళ్ళినట్లు మావయ్య గారు చెప్పారు."

"ఇకనేం నీ భర్త కూడ నా ప్రపోజల్‌కి గ్రీన్ సిగ్నల్ ఇచ్చేసారు. నువ్వు కూడ అంగీకరిస్తే నీ పచ్చని సంసారం పండంటి కాపురమవుతుంది" అన్నది లావణ్య నవ్వుతూ.

అంగీకార సూచకంగా చిరునవ్వు నవ్వింది అలివేణి.

"పద వెళదాం" ఆమె చేయి నందుకున్నాడు ఉమాపతి.

లావణ్య ఎదలో పన్నీటి జల్లు కురిసింది.

● *ఆంధ్ర సచిత్ర వారపత్రిక, 5–10–90* ●